సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 31 । జనవరి । 2024




ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధనను నిర్వహించారు.



ఆధ్యాత్మిక సందడి

ఆధ్యాత్మిక గురువులు రవిశంకర్, త్రిదండి చినజీయర్ స్వామి వైజాగ్ విమానాశ్రయంలో విశాఖ రాకతో సందడి నెలకొంది. 8లో



విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం ఆర్జిత సేవలు, నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. 8లో

న్యూస్‌రీల్

22 మంది ఎంపీడీవోల రిలీవ్

మహారాణిపేట (విశాఖ): సాధారణ ఎన్నికల దృష్ట్యా బదిలీ అయిన 32 మంది మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారుల (ఎంపీడీవో)ను జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు మంగళవారం రిలీవ్ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఒకే దగ్గర గాని, నేటివ్ జిల్లాలోగాని పనిచేసిన 22 మంది ఎంపీడీవోలను ప్రభుత్వం తూర్పుగోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు బదిలీ చేసింది. 18 మంది ఎంపీడీవోలను తూర్పుగోదావరి జిల్లాకు, ఇద్దరు ఎంపీడీవోలకు శ్రీకాకుళం జిల్లాకు, ఇద్దరు ఎంపీడీవోలకు విజయనగరం జిల్లాకు బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఎ.సూర్యకుమారి ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విదితమే. బదిలీ అయిన వారిని రిలీవ్ చేశామని,ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న 22 మంది ఎంపీడీవోలు బుధవారం జాయినింగ్ రిపోర్ట్ ఇస్తారని పోలినాయుడు తెలిపారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



జడ్డంగి జెడ్పీ పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధుల చేతులమీదుగా ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ఇదే పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి పిల్లలలకు స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ, సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అందజేశారు. బాగా చదువుకుని పదిలో మంచి మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు.

క్రికెట్ టోర్నీ విజేత వీఆర్‌పురం జట్టు



విజేతగా నిలిచిన వీఆర్‌పురం మండల క్రికెట్ జట్టు

వీఆర్‌పురం: ఆడుదాం ఆంధ్రాలో భాగంగా రంపచోడవరం జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో వీఆర్‌పురం మండల జట్టు విజేతగా నిలిచింది. డివిజన్ స్థాయిలో రంపచోడవరం – వీఆర్‌పురం జట్ల మధ్య పోటీ మంగళవారం రసవత్తరంగా సాగింది. తొలుత టాస్ గెలిచిన రంపచోడవరం జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. పది ఓవర్లకు 78 పరుగులు చేసి ఆల్‌అవుట్ అయ్యింది. తదుపరి బ్యాటింగ్ చేపట్టిన వీఆర్‌పురం జట్టులో సతీష్ 24 పరుగులు,గౌతమ్ 16 పరుగులు అక్షయ్ 10, నిఖిల్ 10 పరుగులు చేసి తొమ్మిది ఓవర్లకే లక్ష్యాన్ని అధిగమించారు. ఈ సందర్భంగా మండల ప్రజలు విజేత జట్టుకు అభినందనలు తెలిపారు.

2వ తేదీ నుంచి వెటరన్స్ టెన్నిస్

విశాఖ స్పోర్ట్స్: వెటరన్స్ టెన్నిస్ చాంపియన్‌షిప్ ఈనెల 2వ తేదీనుంచి విశాఖలో ప్రారంభం కానుంది. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానికంగా మరో మూడు క్లబ్‌ల్లో ఈ పోటీలు నిర్వహించనున్నారు. 35+నుంచి 75+ వరకు పలు కేటగిరిల్లో సింగిల్స్, డబుల్స్ పోటీలు జరగనున్నాయి. రెండో తేదీ నుంచి క్వాలిఫైయింగ్ రౌండ్స్ జరగనుండగా 4వ తేదీ నుంచి సింగిల్స్ మెయిన్ డ్రా, ఐదో తేదీ నుంచి డబుల్స్ మెయిన్ డ్రా పోటీలు జరగనున్నాయి.

రూ.4.10 లక్షల స్వాధీనం

సబ్బవరం: ఆనందపురం–అనకాపల్లి జాతీయ రహదారిపై మర్రిపాలెం చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.4.10 లక్షలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపారు. సీఐ పిన్నంటి రమణ, ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తన సిబ్బంది సోమవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. కొవ్వూరుకు చెందిన పడాల సత్యనారాయణ, రామచంద్రాపురానికి చెందిన పడాల సాయిబాబు కారు వెళుతుండగా పోలీసులు తనిఖీలు చేశారు. వారి వద్ద రూ.4.10లక్షలు ఉండడంతో ఆధారాలు చూపించమని అడిగారు. అయితే నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు వారు చూపించకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. వారిని సబ్బవరం మండల మేజిస్ట్రేట్ వద్ద హాజరుపరిచామని పోలీసులు తెలిపారు.

24 వంతెనలు.. 500 గ్రామాలు

గెడ్డలు పొంగినప్పుడల్లా మారుమూల గ్రామాలకు బాహ్య ప్రపంచంతో రోజుల తరబడి సంబంధాలు తెగిపోయేవి. అత్యవసర పరిస్థితుల్లో రాకపోకలు సాగించేందుకు గిరిజనులు నానా ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గెడ్డలపై బ్రిడ్జిలు నిర్మాణాలు చేపట్టడం వల్ల రవాణా వ్యవస్థ మెరుగుపడింది.

- రూ. 32.68 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- ఇప్పటివరకు 12 చోట్ల పూర్తి
- మిగతావి ఏప్రిల్ నెలాఖరుకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు
- మారుమూల గ్రామాలకు మెరుగుపడుతున్న రవాణా వ్యవస్థ



అనంతగిరి మండలం సారవానిపాలెం గెడ్డపై పూర్తయిన వంతెన నిర్మాణం

సాక్షి, పాడేరు: ఏజెన్సీలో గిరిజనుల బ్రిడ్జిల నిర్మాణ కలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అంచెలంచెలుగా నెరవేరుస్తోంది. గెడ్డలపై వంతెనలు.. రోడ్ల సౌకర్యాలను అందుబాటులోకి తెస్తుండంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.

పాడేరు కేంద్రంగా జిల్లా ఏర్పాటుతో..

పాడేరు కేంద్రంగా ప్రత్యేకంగా జిల్లాను ఏర్పాటుచేసిన రాష్ట్ర ప్రభుత్వం ఒక పక్క సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూనే మరోపక్క మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించింది. అంచెలంచెలుగా బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టి మారుమూల గిరిజనులకు అవస్థలను దూరం చేసింది. జిల్లాలోని పాడేరు, అరకు నియోజకవర్గాల పరిధిలో 24 గెడ్డలపై రూ.32.68 కోట్లతో బ్రిడ్జిల నిర్మాణం చేపట్టింది. ఇవి పూర్తయితే 500 గిరిజన గ్రామాలకు రవాణా ఇబ్బందులు తప్పినట్టే. ఇప్పటివరకు చేపట్టిన 24 వంతెనల నిర్మాణాల్లో 12 పూర్తయ్యాయి. మిగతా చోట్ల పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

- అరకులోయ నియోజకవర్గం పరిధిలోని తుమ్మలవలస–గుమ్మకోట రోడ్డులో రూ.1.50 కోట్లు, సారవనపాలెం రోడ్డులో రూ.2కోట్లు, అనంతగిరి సమీపంలో రూ.కోటి, డుంబ్రిగుడ మండలంలో కొల్లాపుట్టు ప్రాంతంలో రూ.75లక్షలు, లోగిలి రోడ్డులో రూ.1.80 కోట్లు, మంచంగిపుట్టు మండలం కర్లపొధర్ రోడ్డులో రూ.50 లక్షల చొప్పున బ్రిడ్జిల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు వెచ్చించింది. ఏనుగురాయి రోడ్డులో రూ.80 లక్షలు, గత్తిరబంద రోడ్డులో రూ.35 లక్షలు, పెదబయలు మండలం పెదలోవ గెడ్డపై రూ.35 లక్షలు, పాతరూడకోట చినగెడ్డపై రూ.15 లక్షలు,అరిమిరాలు గెడ్డపై రూ.35 లక్షలు, హుకుంపేట మండలం ఆమోరు గెడ్డపై రూ.40 లక్షల చొప్పున ప్రభుత్వం వెచ్చించింది. ఈ మేరకు పనులు పూర్తయ్యాయి.

మరో 12 చోట్ల..

ఏప్రిల్ నెలాఖరుకు మిగతా 12 బ్రిడ్జిలు పూర్తి చేయాలన్న లక్ష్యంతో కలెక్టర్ సుమిత్‌కుమార్, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నారు. సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తున్నారు. జి.మాడుగుల మండలం కిల్లంకోట రోడ్డులో కోడిమామిడి గెడ్డపై రూ.3కోట్లు, కొయ్యూరు మండలం పలకజీడి ప్రాంతంలో గెడ్డపై రూ.1.30 కోట్లు, యూ.చీడిపాలెం రోడ్డులో గెడ్డపై రూ.2.10కోట్లు, అరకులోయ మండలంలోని జయంతివలస గెడ్డపై రూ.2కోట్లతో పనులు చురుగ్గా జరుగుతున్నాయి. కించుమండ సంత సమీపంలోని గెడ్డపై రూ.4.40 కోట్లు, అనంతగిరి మండలం జీలుగుల పాడు ప్రాంతంలోని గెడ్డపై రూ.2.20 కోట్లు, గరుగుబిల్లి గెడ్డపై రూ.1.63 కోట్లు హుకుంపేట మండలం బీసాయిపుట్టు గెడ్డపై రూ.35 లక్షలతో బ్రిడ్జిల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. పెదబయలు మండలంలోని జామిగుడ పంచాయతీ గుంజివాడ గెడ్డపై రూ.2 కోట్లు,.డుంబ్రిగుడ మండలం కోనాపుట్టు గెడ్డపై రూ.90 లక్షలతో బ్రిడ్జి నిర్మాణాలను ప్రభుత్వం చేపట్టింది.



డుంబ్రిగుడ మండలం లోగిలిరోడ్డులో పూర్తయిన వంతెన నిర్మాణం



జి.మాడుగుల మండలం కోడిమామిడి గెడ్డపై జరుగుతున్న వంతెన నిర్మాణం

త్వరితగతిన పూర్తి చేస్తాం



పాడేరు, అరకు నియోజకవర్గాల్లోని అన్ని వంతెనల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకున్నాం. ఇప్పటికి 12 పూర్తి కాగా మిగిలిన 12 వంతెనలు కూడా పూర్తయితే మారుమూల గ్రామాలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుంది.

– వి.అభిషేక్, ఐటీడీఏ పీవో, పాడేరు

ఉత్తమ సేవలకు ఎప్పుడూ గుర్తింపు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- బదిలీ అయిన జేసీ కార్తీక్‌కు సత్కారం

సాక్షి, పాడేరు: ఉత్తమ సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. విజయనగరం జాయింట్ కలెక్టర్‌గా బదిలీ అయిన కె.కార్తీక్‌ను మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో సత్కార కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు ఐటీడీఏ పీవో వి.అభిషేక్, పాడేరు సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి, ఇతర అధికారులు ఆయనను సత్కరించారు. మోదకొండమ్మతల్లి చిత్రపటాన్ని జ్ఞాపికగా అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జేసీగా కార్తీక్ తక్కువ కాలం పని చేసినప్పటికీ అధికారులు, సిబ్బంది,ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారన్నారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ జేసీ అక్కడ కూడా మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ కలెక్టర్, ఐటీడీఏ పీవోల సహకారం, సలహాలు,సూచనలు గుర్తింపు పొందేందుకు ఎంతో దోహదపడ్డాయన్నారు. డీఆర్వో వీవీ రమణ,ఎస్‌డీసీలు,అంబేద్కర్, మురళీకృష్ణ, శర్మ, గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు, డీఎల్‌డీవో శాంతలక్ష్మి పాల్గొన్నారు.



జ్ఞాపికగా అమ్మవారి ఫొటోను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



కార్తీక్‌ను సత్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ ధాత్రిరెడ్డి

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం



గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

కొయ్యూరు: గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థతో సాకారమైందని పాడేరు ఎమ్మెల్యే కొట్టిగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రేవళ్ల గ్రామంలో మంగళవారం గ్రామ సచివాలయ భవనాన్ని ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడారు. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో పాలన చేరువైందన్నారు.చంద్రబాబుకు ప్రజలకు గుర్తుండి పోయే ఒక్క పని చేయాలన్న ఆలోచన రాకపోవడం రాష్ట్ర ప్రజల దురదృష్టమన్నారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు ప్రజలకు వరమన్నారు. రేవళ్లలో మూతపడిన పాఠశాలను తెలిపిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై కలెక్టర్ విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాశారని ఆమె తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరానికి పాఠశాల అందుబాటులోకి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రయంలో ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మునిలినాయుడు, పార్టీ జిల్లా కార్యదర్శి గాడి సత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షులు జల్లి బాబులు, గ్రామ సచివాలయ కన్వీనర్ బండి సుధాకర్, సర్పంచ్‌లు వెంకటలక్ష్మి, డి.రమేష్ పాల్గొన్నారు. ఇలావుండగా జాతీయ ఆదివాసీ మహోత్సవ కార్యక్రమం పోస్టర్‌ను ఎమ్మెల్యేఆవిష్కరించారు.

ఉన్నత పర్వతశ్రేణి ప్రాంతాలు పరిశోధనలకు అనుకూలం

విశ్రాంత ఏడీఆర్ రత్న సుధాకర్

చింతపల్లి రూరల్: ఉన్నత పర్వతశ్రేణి ప్రాంతాలు పరిశోధనలకు అనుకూలమని విశ్రాంత ఏడీఆర్ రత్నసుధాకర్ అన్నారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో రెండవ రోజు మంగళవారం జాతీయ సదస్సు కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో రైతుల ఎదుగుదలకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని అన్నారు. లాభసాటి వ్యవసాయంపై గిరిజనులకు అవగాహన కల్పించేందుకు వీలుగా మరిన్ని పరిశోధనలు చెపట్టాల్సిన అవసరం ఉందన్నారు. భిన్నమైన పంటలు పండించే రైతులకు అధిక ధర, మార్కెటింగ్ కల్పించేందుకు స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని కోరారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు, పీహెచ్‌డీ విద్యార్థులు పలు ప్రాజెక్టులకు సంబంధించిన నివేదికను సమర్పించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్‌తోపాటు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేశారు. వీటిలో బాగున్న ప్రాజెక్టులను పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించనున్నట్లు జాతీయ సదస్సు సమన్వయకర్త చింతపల్లి ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి పరిశోధన స్థానం విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కదిరి మోహన్, శాస్త్రవేత్తలు శేఖర్, దివ్య సుధ, జోగారావు, ఉద్యాన శాస్త్రవేత్తలు శివకుమార్, బిందు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న విశ్రాంత ఏడీఆర్ రత్న సుధాకర్, చింతపల్లి ఏడీఆర్ సురేష్ కుమార్

అధిక ఆదాయాన్నిచ్చే పంటలకు ప్రాధాన్యం



గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తున్న బీసీటీ కేవీకే శాస్త్రవేత్తలు



శాస్త్రవేత్తలు, పోలీసు అధికారులకు స్వాగతం పలుకుతున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి: గిరిజన రైతులు గంజాయికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయాన్నిచ్చే పంటలను సాగు చేయడం ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శైలజ అన్నారు.మండలంలోని మారుమూల గ్రామాలైన సాగులు, లక్కవరం, కుంకుంపూడి గ్రామాల్లో మంగళవారం గూడెంకొత్తవీధి సీఐ అశోక్‌కుమార్, ఎస్‌ఐ అప్పలసూరి ఆధ్వర్యంలో శాస్త్రవేత్తల బృందం పర్యటించింది.గిరిజన ప్రాంతా వాతావరణానికి అనువైన పంటల సాగుకు శాస్త్రవేత్తలు శైలజ, నాగేంద్ర అవగాహన కల్పించారు.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్



హాజరైన సెక్టార్ అధికారులు

కలెక్టర్ సుమిత్‌కుమార్

పాడేరు: పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితులపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అరకు నియోజకవర్గ సెక్టార్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు సూచనలు చేశారు. నియోజకవర్గం పరిధిలో 54 సెక్టార్లలో 304 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. పోలింగ్ కేంద్రాల స్థితిగతులు, రవాణా సదుపాయాలు, అందుబాటులో ఉన్న సమాచార వ్యవస్థలపై సెక్టార్ అధికారులకు అవగాహన ఉండాలని సూచించారు. ఎన్నికల సిబ్బందిని సకాలంలో పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన వాహనాల వివరాలను తెలుసుకున్నారు. సమస్యాత్మక కేంద్రాల వివరాలను తెలుసుకున్నారు. పాడేరు ఐటీడీఏ పీవో వి.అభిషేక్ మాట్లాడుతూ బస్సుల్లో ఎన్నికల సిబ్బంది వెళ్లేందుకు ప్రాధాన్యమివ్వాలన్నారు. బస్సులు వెళ్లని గ్రామాలకు జీపులను కేటాయిస్తామని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ప్రారంభం కాగానే జిల్లా ఎన్నికల అధికారికి సమాచారం అందించాలని సూచించారు. డీఆర్వో వీవీ రమణ, అంబేద్కర్ పాల్గొన్నారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైం అండ్ షిప్ బిల్డింగ్(సెమ్స్) ఆధ్వర్యంలో సీడాప్, ఏపీఎస్‌ఎస్‌డీసీ సంస్థల సహకారంతో గ్రామీణ ప్రాంతాల్లోని 21 నుంచి 27 సంవత్సరాల వయసు కలిగిన నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత ఉచిత శిక్షణ ఇవ్వనున్నారు. 10వ తరగతి, ఇంటర్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, డిప్లమో, ఇంజినీరింగ్ మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఉత్తీర్ణులైన వారు శిక్షణకు అర్హులు. ప్రొడక్ట్ డిజైన్ ఇంజినీర్, మెకానికల్, మెకాట్రానిక్స్ ఇంజనీర్, ఆటోమేషన్, రోబోటిక్స్ ఇంజినీర్, కొరియర్ సూపర్‌వైజర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, పిక్కర్, ఇన్వెంటరీ కంట్రోలర్, సీఎన్‌సీ ఆపరేటర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి, ఉపాధి కల్పిస్తామని సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కమాండర్ గోపీకృష్ణ శివ్వం తెలిపారు. 99481 83865, 77948 40934, 0891–2704010 నంబర్లకు సంప్రదించాలన్నారు.

నిబంధనలకు అనుగుణంగా విధులు



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న పీవో సూరజ్‌గనోరే, రంపచోడవరం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే

రంపచోడవరం: రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం సిబ్బంది పనిచేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి నోడల్, సెక్టార్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. ప్రతీ సెక్టార్‌కు సంబంధించిన మ్యాప్‌లు తయారుచేసి సమర్పించాలన్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా పోలింగ్ సిబ్బంది పోలింగ్ బూత్‌లకు వెళ్లేందుకు సెక్టార్ల వారీగా కావాల్సిన వాహనాలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రంపచోడవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాలకు 59 మంది సెక్టార్, 18 మంది నోడల్ అధికారులను నియమించినట్టు చెప్పారు. త్వరలో వీరికి శిక్షణ ఇస్తామన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రంపచోడవరం నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించిన ఫొటోలు తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. అన్ని మండలాల్లో ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన కల్పించాలని సూచించారు. నోడల్, సెక్టార్ అధికారులు,తహసీల్దార్లు ఎప్పటికప్పుడు పోలింగ్ కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణ, టి.లక్ష్మణ్, ఇందిరాబాయ్ పాల్గొన్నారు.



ఎయిర్‌పోర్టు నుంచి వస్తున్న ఇండియా ఆటగాళ్లు యశస్వి జైశ్వాల్, శ్రేయస్ అయ్యర్, బుమ్రా, కుల్దీప్ యాదవ్, గిల్, అశ్విన్, ముఖేష్‌కుమార్, సిరాజ్, ఇంగ్లండ్ ఆటగాళ్లు

క్రికెటర్లు వచ్చేశారు

- ఫిబ్రవరి 2 నుంచి రెండో టెస్ట్
- విశాఖ చేరుకున్న భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు

విశాఖ స్పోర్ట్స్: భారత్–ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో భాగంగా రెండో టెస్ట్‌కు పీఎంపాలెంలోని వైఎస్సార్–ఏసీఏ స్టేడియం సిద్ధమైంది. ఫిబ్రవరి రెండో తేదీ నుంచి జరిగే ఈ టెస్ట్‌లో ఆడే భారత్, ఇంగ్లండ్ జట్లు మంగళవారం విశాఖ చేరుకున్నాయి. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ రెండు జట్ల ఆటగాళ్లు విశాఖ విమానాశ్రయంలో అడుగు పెట్టారు. తమ అభిమాన క్రికెటర్లను చూడడానికి అభిమానులు పెద్ద ఎత్తున విమానాశ్రయానికి తరలివచ్చారు. ఇరు జట్ల క్రీడాకారులను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ అధ్యక్ష కార్యదర్శులు శరత్‌చంద్రరెడ్డి, ఎస్ఆర్ గోపీనాథరెడ్డి స్వాగతం పలికారు. అనంతరం భారత్, ఇంగ్లండ్ ఆటగాళ్లు నోవాటెల్‌కు చేరుకున్నారు. బుధ, గురువారాల్లో ప్రాక్టీస్ సెషన్స్‌లో పాల్గొంటారు. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టెస్ట్‌లో తొలి రెండు రోజులు ఆధిక్యాన్ని ప్రదర్శించిన భారత్ జట్టు అనూహ్యంగా నాలుగు రోజుల్లోనే మ్యాచ్‌ను ముగించేసి పరాజయం మూటగట్టుకుంది. బజ్‌బాల్ క్రికెట్ పద్ధతిని ఆకళింపు చేసుకున్న ఇంగ్లండ్ జట్టు అనుహ్యంగా తొలి మ్యాచ్ విజయం సాధించి, 1-0 ఆధిక్యంతో విశాఖకు విచ్చేసింది. తొలి టెస్ట్‌లో గాయపడిన కేఎల్ రాహుల్, రవీంద్ర జడేజా మినహా రెండో టెస్ట్‌కు ఎంపిక చేసిన పూర్తి భారత జట్టు విశాఖ చేరుకుంది.

స్కూబా డైవింగ్‌కు రుషికొండ తీరం అనుకూలం

కొమ్మాది: స్కూబా డైవింగ్‌కు రుషికొండ తీరం అనువైన ప్రాంతమని, లోతైన సముద్ర గర్భంలో అందమైన వింతలు ఎన్నో తమను ఆకట్టుకున్నాయని అమెరికాకు చెందిన ప్రఖ్యాత స్కూబా డైవింగ్ మాస్టర్ జెస్సీకామన్నా అన్నారు. స్కూబా డైవింగ్‌కు విశాఖ డెస్టినేషన్‌గా అభివృద్ధి చెందుతున్న దృష్ట్యా ఆమె మంగళవారం రుషికొండ తీరాన్ని సందర్శించి కాసేపు స్కూబా డైవింగ్ చేశారు. ఈ డైవింగ్‌లో సముద్రం లోతును అన్వేషించినట్లు తెలిపారు. విశాఖలోని తీర ప్రాంతాలు తమను ఎంతగానో ఆకట్టుకున్నాయని, ఆమె తన అనుభవాలు స్థానిక స్కూబా డైవర్స్‌తో పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో లైవ్ ఇన్ అడ్వంచర్ వ్యవస్థాపకుడు బి.బలరామనాయుడు పాల్గొన్నారు.



క్లుప్తంగా

తెలంగాణ మద్యం స్వాధీనం

ఎటపాక: మండలంలోని రామగోపాలపురంలో అక్రమంగా విక్రయిస్తున్న తెలంగాణ మద్యం బాటిళ్లను ఎటపాక పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. రాష్ట్ర సరిహద్దుల నుంచి తెలంగాణ మద్యం తీసుకువచ్చి అమ్ముతున్నారనే సమాచారంతో బెల్టు దుకాణంపై దాడి చేసి 36 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పార్థసారధి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఆధ్యాత్మిక సందడి

- విశాఖ విమానాశ్రయానికి చినజీయర్ స్వామి, రవిశంకర్ రాక

గోపాలపట్నం(విశాఖ): ఆధ్యాత్మిక గురువులు రవిశంకర్, త్రిదండి చినజీయర్ స్వామి వైర్వేరు విమానాల్లో మంగళవారం విశాఖ చేరుకున్నారు. గీతం యూనివర్సిటీలో జరిగే కార్యక్రమానికి విశాఖ వచ్చిన గురుదేవ్ రవిశంకర్.. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో వర్సిటీకి వెళ్లారు. త్రిదండి చినజీయర్ స్వామీజీ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ వచ్చారు. ఆయన్ని కలుసుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు విమానాశ్రయానికి చేరుకున్నారు. వారికి స్వామి ప్రసాదాలు అందించారు.

సింహగిరిపై విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్య కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ అనంతరం భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. విశేషంగా హారతులు అందజేశారు.

ATCHUTAPURAM EFFLUENT TREATMENT LIMITED
CIN No: U41000AP2016PLC103829
ADMIN. OFFICE: Ground Floor, One Stop Service center, APIIC Industrial Estate (APSEZ), ATCHUTAPURAM - 531 011.
Contact : 9533309496 EMAIL: admin@aetltd.org

Notice Inviting Sealed Bids

Name of the work: Supply of Indonesian Coal of 2000 metric Tonnes.

Sealed bids invited in two cover system from interested bidders for supply of imported Indonesian coal to M/s. AETL, Atchutapuram Interested bidders may collect the Bid Documents by paying documents fees of Rs.2360/-in the form of DD in favour of "ATCHUTAPURAM EFFLUENT TREATMENT LIMITED" payable Visakhapatnam from 31/01/2024 to 07/02/2024 latest by 15:00 Hrs at our ADMIN OFFICE. Last Date for receipt of Sealed Tenders/ Quotations is 07/02/2024 latest by 15:30 hrs.

Managing Director
M/s. AETL, Atchutapuram

రిమాండ్.. డిమాండ్

జైల్‌లో ఓ అధికారి పైసా వసూల్..!



విశాఖ కేంద్రకారాగారం..

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో వసూళ్ల రాజాలు చెలరేగుతున్నారు. జైళ్లలో నూతన సంస్కరణలు తీసుకొచ్చి శిక్ష అనుభవిస్తున్న ఖైదీల్లో మార్పు తీసుకురావడానికి ఓ పక్క కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. వాటిని అమలు చేయాల్సిన జైల్ అధికారుల్లో కొందరు ఆ విధానాలను విస్మరిస్తున్నారు. విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీల నుంచి ఓ అధికారి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నట్టు విశ్వసనీయ సమాచారం. జైల్ లోపల ఖైదీల లీడర్లతో డబ్బులను వసూలు చేయించి జేబులు నింపుకొంటున్నారు. ఇక్కడ జైల్‌లో నర్మదా, తపతి, గోదావరి, పెన్న, కావేరి, గోస్తని, గంగా, తదితర నదుల పేర్లతో బేరక్‌లున్నాయి. సాధారణ ఖైదీలు, రిమాండ్ ఖైదీలు, తీవ్ర నేరాలకు పాల్పడి శిక్ష పడిన ఖైదీలు, మావోయిస్టులు తదితర ఖైదీలను వేర్వేరుగా ఆయా బ్యారెక్‌లలో పెడతారు. జైల్ నిబంధనలు, అప్పటి పరిస్థితులను బట్టి రిమాండ్ ఖైదీలను, అప్పుడే శిక్షపడిన ఖైదీలను తక్కువ రద్దీ ఉన్న బ్యారెక్‌లు, సున్నిత మనస్కులైన ఖైదీలు ఉండే బేరక్‌లలో ఉంచుతారు. ప్రతి బ్యారెక్‌లకు సీనియర్ ఖైదీలు మేస్త్రీలు (లీడర్లు)గా ఉంటారు. వారు మిగిలిన ఖైదీలను నియంత్రిస్తూ జైల్ సిబ్బందికి సహాయకులుగా ఉంటారు. జైల్‌కు వెళ్లే రిమాండ్ ఖైదీలను తక్కువ రద్దీ గల బేరక్‌లలో పెట్టాల్సి ఉంది. అలాంటి బేరక్‌లలో పెట్టడానికి రిమాండ్ ఖైదీల నుంచి ఓ అధికారి మేస్త్రీల సాయంతో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఖైదీల కుటుంబ సభ్యుల నుంచి మేస్త్రీల కుటుంబ సభ్యుల బ్యాంక్ ఖాతాలలోకి నగదు జమ చేసుకొని తర్వాత విత్‌డ్రాలు చేస్తున్నట్లు తెలిసింది. అలా డబ్బులు ఇవ్వని ఖైదీలను కరుడు కట్టిన నేరాలు చేసి శిక్ష అనుభవిస్తున్న బేరక్‌లు, రద్దీగా ఉండే బేరక్‌లలో వేస్తామని, అక్కడ ఆ ఖైదీల మధ్య తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరిస్తున్నారని, శిక్ష పూర్తిచేసుకొని బయటకు వచ్చిన వారు, బెయిల్‌పై బయటకు వచ్చిన వారు ఆవేదన చెందుతున్నారు. జైల్‌లో ఉన్నప్పుడు దీనిపై వారిని నిలదీస్తే ఎలాంటి సమస్య ఎదుర్కోవాల్సి వస్తుందోనని ఫిర్యాదు చేయలేకపోయామని అంటున్నారు. ఖైదీల కుటుంబ ఆర్థిక పరిస్థితిని బట్టి ఒక్కొక్కరి నుంచి రూ 5,000 నుంచి ఆపైన వసూలు చేస్తున్నారని అంటున్నారు. ఆ అధికారి గతంలో పనిచేసిన జైల్‌లో కూడా ఇదే తీరు కనబరిచాడని, ఉన్నతాధికారులు పలుసార్లు మందలించినా ఆయన తీరు మారలేదని ఇక్కడ సిబ్బందిలో కూడా గుసగుసలు వినిపిస్తున్నాయి. జైల్ ఉన్నతాధికారులు దీనిపై దృష్టి సారించి ఇలాంటి పరిణామాలు జరగకుండా అడ్డుకట్టవేయాలని ఖైదీల కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

ఎలాంటి ఫిర్యాదులు రాలేదు

జైల్‌లో ఖైదీల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు మాకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ఖైదీలను ఎవరైనా డబ్బులు అడిగితే వెంటనే మా దృష్టికి తీసుకురావాలి. మేం ప్రతిరోజు జైల్‌లో రౌండ్స్‌కు వెలుతుంటాం. ఆ రౌండ్స్‌లో ఖైదీల సమస్యలు కూడా అడుగుతుంటాం. అలాంటిప్పుడు ఖైదీలు నిర్భయంగా ఏ సమస్య గురించైనా చెప్పవచ్చు. కానీ ఇంతవరకు ఎవ్వరూ డబ్బులు అడుగుతున్నట్లు మాకు చెప్పలేదు. అధికారులు, సిబ్బందిని పిలిపించి దీనిపై సీరియస్‌గా హెచ్చరిస్తాం. ఒకవేళ డబ్బులు తీసుకున్నట్టు వెల్లడైతే చర్యలు తీసుకొంటాం.

–కిశోర్‌కుమార్, కేంద్ర కారాగారం సూపరింటెండెంట్

'పిట్టల'తో చేపల వేట!

- ఎర చేపలకు రేడియం గాలాలు
- వీటిని పిట్టలుగా వ్యవహరిస్తున్న మత్స్యకారులు
- ఈ తరహా ఇప్పటి వరకు గుజరాత్‌లో వేట
- అదే బాటను అనుసరిస్తున్న ఆంధ్ర జాలర్లు



ఎర చేపలకు అమర్చిన పిట్టలు (రూస్టర్ టెయిల్స్)



ఎరగా వేసే చిన్న చేపలకు అమర్చిన గాలాలు

సాక్షి, విశాఖపట్నం: పిట్టలతో చేపల వేట! వినడానికి ఒకింత ఆశ్చర్యంగా ఉంది కదా? అయితే కొన్నాళ్లుగా మత్స్యకారులు ఇలా పిట్టలతోనే వేట సాగిస్తున్నారు! అయితే ఇవి నిజమైన పిట్టలు కాదు.. గాలాలతో పెద్ద చేపలను వేటాడటానికి చిన్న చేపలను ఎరగా వేస్తుంటారు. ఈ చిన్న చేపలను ఇనుప హుక్‌లకు గుచ్చి బోటు నుంచి సముద్రంలోకి వదులుతారు. ఈ చేపలను తినడానికి పెద్ద చేపలు వస్తాయి. చిన్న చేపలను మింగిన పెద్ద చేపలు గాలాలకు చిక్కుకుంటాయి. ఇదంతా గాలాలతో జరిగే వేట ప్రక్రియ. అయితే ఎర వేసిన చేపల తోక భాగంలో పెద్ద చేపలను ఆకర్షించడానికి వీలుగా రేడియంతో చేసిన రూస్టర్ టెయిల్స్‌ను కూడా అమరుస్తారు. ఇవి పక్షి ఈకలు మాదిరిగా ఉంటాయి. అందువల్ల మత్స్యకారులు వీటిని పిట్టలుగా వ్యవహరిస్తారు. ఈ రూస్టర్ టెయిల్స్ రేడియం కాంతిని కలిగి ఉండడంతో సుదూరంలో ఉన్న చేపలను ఆకట్టుకుంటాయి. ఇన్నాళ్లూ ఈ తరహా చేపలవేట గుజరాత్‌లోని వీరావల్ సహా మరికొన్ని ప్రాంతాల్లో అక్కడ మత్స్యకారులు చేపడుతున్నారు. కొన్నాళ్ల నుంచి ఉత్తరాంధ్ర సహా రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ ఈ పిట్టల వేటను సాగిస్తున్నారని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ ‘సాక్షి’కి చెప్పారు.

రూస్టర్ టెయిల్ ధర రూ.50

ఒక్కో పిట్ట (రూస్టర్ టెయిల్) ఖరీదు రూ.50 వరకు ఉంటోంది. వీటిని పలుమార్లు ఉపయోగించుకునే వీలుంది. ఈ పిట్టలతో చేపల వేట ఆశాజనకంగా ఉండడంతో కొంతమంది మత్స్యకారులు క్రమంగా అదే బాటలో పయనిస్తున్నారు. ఈ గాలాలకు ఖరీదైన, మార్కెట్లో మంచి ధర పలికే బొంతలు, పారలు, మట్టలు, ఎర్ర చేపలు, సైమన్లు, కోనాం, రాయి చేపలు వంటివి చిక్కుతున్నాయి. వీటి బరువు రెండు నుంచి ఐదారు కిలోల వరకు ఉంటాయి. మార్కెట్లో వీటికి రకాన్ని బట్టి కిలో రూ.200 నుంచి 600 వరకు మంచి ధర పలుకుతోంది. అసలే మరబోట్లతో సాగిస్తున్న సంప్రదాయ వేట డీజిల్ ధర ఎగసి పడుతుండడంతో గిట్టుబాటు కావడం లేదన్న భావనతో మత్స్యకారులున్నారు. ఇలాంటి వారు పిట్టల వేట వైపు ఆకర్షితులవుతున్నారు.

నేడు రీజినల్ జాబ్ మేళా

మురళీనగర్: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం విజయనగరం సీతమ్ ఇంజనీరింగ్ కళాశాలలో రీజినల్ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సాయికృష్ణ చైతన్య తెలిపారు. ఈ జాబ్ మేళాలో 87 బహుళజాతి కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఐటీ, ఫార్మా, ఆటోమొబైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, టూరిజం –హాస్పిటాలిటీ, రిటైల్, మార్కెటింగ్, లాజిస్టిక్స్, రిటైల్ జ్యువలరీ విభాగాల్లో సుమారు 5,892 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. విశాఖపట్నం జిల్లా యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదో తరగతి నుంచి పీజీ వరకు చదువుకున్న నిరుద్యోగ యువతీయువకులు హాజరు కావాలని, స్పాట్ రిజిస్ట్రేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థుల నైపుణ్యాల ఆధారంగా రూ.15,000 నుంచి రూ.60,000 వేల వరకు వేతనాలు ఉంటాయన్నారు.

2న జిల్లా ఉపాధి కార్యాలయంలో..

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో క్లర్లికల్, టెక్నికల్ సంయుక్త ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. డాన్ బోస్కో, మెడిప్లస్, సువర్ణభూమి, బిగ్ బాస్కెట్, కెఎఫ్‌సీ, ఆర్‌కె హాస్పిటల్, హెటిరో డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్‌లో 477 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. జూనియర్ కెమిస్ట్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, అసిస్టెంట్, రికవరీ, క్లర్కు, బ్రాంచ్ ఇన్‌చార్జి ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ పూర్తిచేసిన 18–45 ఏళ్ల మధ్య వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.11,000 నుంచి రూ.25,500ల వరకు ఉంటుందన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



రూపవతి

కంచరపాలెం: విశాఖ, అనకాపల్లి జిల్లాల్లోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2024–2025 సంవత్సరానికి గానూ 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త ఎస్.రూపవతి తెలిపారు. కంచరపాలెంలోని డాక్టర్ బి ఆర్.అంబేడ్కర్ గురుకుల కార్యాలయంలో మంగళవారం ఈ వివరాలు వెల్లడించారు. మేహాద్రి గెడ్డ, సెంటర్ ఫర్ ఎక్సలెన్స్(కొమ్మాది), కోనాం, కొక్కిరాపల్లి, తాళ్లపాలెం, నక్కపల్లి(నర్సీపట్నం)లోని బాలికల గురుకుల పాఠశాలలు, సబ్బవరం, శ్రీకృష్ణాపురం, దేవరాపల్లి, గొలుగొండలోని బాలుర గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశానికి ఫిబ్రవరి 23లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. 5వ తరగతిలో ప్రవేశానికి మార్చి10 ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు https:// apbragcet.apcfss. in/ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 0891–2799641 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

చోడవరం నియోజకవర్గంలో మరో 7 కొత్త రోడ్లు

చోడవరం : నియోజకవర్గంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన ఏడు పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం చెప్పారు. ఈ రోడ్ల నిర్మాణానికి రూ. 21.32 కోట్లు ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఆయన తెలిపారు. రావికమతం మండలంలో సీకేపాడు నుంచి చలిసింగం రోడ్డుకు రూ.2.65 కోట్లు, మేడవాడ- కానాడ రోడ్డుకు రూ. కోటి 24 లక్షలు, తోటకూరపాలెంనుంచి కన్నూరు పాలెం రోడ్డు జంక్షన్ వరకూ రూ.5.33 కోట్లు, చినపాచిలి నుంచి టి. అర్జాపురం మీదుగా బిఎన్‌రోడ్డు జంక్షన్‌కు రూ.6.98 కోట్లు మంజూరయ్యాయి. చోడవరం మండలంలో చోడవరం, తిమ్మన్నపాలెం రోడ్డు నుంచి వయా పోలేపల్లి మీదుగా బుచ్చెయ్యపేట జంక్షన్ వరకూ 4.71 కిలోమీటర్ల రోడ్డుకు రూ. కోటి 51 లక్షలు, రోలుగుంట మండలంలో ఒడ్డిప నుంచి గైరంపేట, బీబీ పట్నం రోడ్డుకు రూ.2.31 కోట్లు, బుచ్చెయ్యపేట మండలంలో సీతయ్యపేట-తట్టబంద బీటీ రోడ్డు జంక్షన్ నుంచి రాజుపాలెం రోడ్డుకు రూ.కోటి 30 లక్షలు మంజూరయ్యాయి. నాబార్డు ద్వారా ఈ నిధులు మంజూరయ్యాయని ధర్మశ్రీ చెప్పారు. త్వరలో రోడ్ల నిర్మాణం చేపడతామని ఆయన చెప్పారు.

40 ఏళ్ల అనుబంధాల కలబోత

ఉత్సాహంగా స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కలయిక



40 ఏళ్ల ఆత్మీయ కలయికలో ఉద్యోగులు, మాజీ ఉద్యోగులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల ఆత్మీయ కలయిక ఉత్సాహంగా జరిగింది. 1983 బ్యాచ్‌కు చెందిన ఉద్యోగులు 40 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం నెహ్రూ పార్కులో కలిశారు. సుమారు 190 మంది ఉద్యోగులు కలిసి ఆనందంగా గడిపారు. వీరిలో ఒకరిద్దరు మినహా అందరూ పదవీ విరమణ చేసినవారే. ఉద్యోగులు తాము సాధించిన పదోన్నతులు, తమ కుటుంబాల గురించి పంచుకున్నారు. తమ పిల్లలు సాధించిన విజయాలు, వారి ఎదిగిన తీరును తెలిపారు. ఆనందంగా సాగిన ఈ కార్యక్రమంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు, సేవ్ వైజాగ్ స్టీల్, విశాఖ ఉక్కును కాపాడుకుంటాం అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. స్టీల్ ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి డి.ఆదినారాయణ, సిటు సీనియర్ నాయకులు, మాజీ ప్రధాన కార్యదర్శి ఎస్.రామారావు తదితరులు తమ బ్యాచ్ ఉద్యోగులతో ఆనందంగా గడిపారు.

అమ్మవారి ఆలయంలో మళ్లీ చోరీ

రూ.20 వేల నగదు, సీసీ కెమెరాల అపహరణ



నగదు దొంగలించుకుపోయిన అమ్మవారి హుండీ



కట్ చేసి ఉన్న సీసీ కెమెరాల వైర్లు

అనకాపల్లి : కేఎస్‌ఆర్ పేట మోదకొండమ్మ ఆలయంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీ పగలగొట్టి రూ.20వేల నగదుతోపాటు సీసీ కెమెరాల కేబుల్స్ కట్ చేసి యూనిట్లతోపాటు కెమెరాలను దొంగలించుకుపోయారు. జనవరి మొదటి వారంలో చోరీ ఘటనపై ఆలయ కమిటీ సభ్యులు బి.నాగేశ్వరరావు, సంతోష్ గ్రామీణ ఎస్‌ఐ తేజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్‌ఐ దర్యాప్తు చేస్తుండగా మరోసారి చోరీ జరగడంతో గ్రామస్తుల్లో ఆందోళన చోటుచేసుకుంది. ఎస్‌ఐతో సాక్షి మాట్లాడుతూ నిఘా పెంచుతామన్నారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి నిందితులను పట్టుకుంటామని చెప్పారు.

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ



బంతి, చామంతుల అలంకరణలో కొత్తమ్మతల్లి



వివిధ రకాల పూలతో రాస పోలమాంబ అమ్మవారు

తగరపువలస: జీవీఎంసీ ఒకటో వార్డు సంతోపేట గ్రామదేవత కొత్తమ్మతల్లిని మంగళవారం బంతి, చామంతి, గజమాలలతో అలంకరించారు. రాయల్ రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో జీరు వాసురెడ్డి ఆర్థిక సహకారంతో అలంకరణ పూర్తి చేశారు. ఈ అలంకరణకు భీమిలి మండలం చిప్పాడకు చెందిన సాడి కుమార్, తాళ్లవలసకు చెందిన బోని ఈశ్వరరావు, సంతపేటకు చెందిన దుంప శంకరరావు సహకారం అందించారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారి సేవలో ఉంటున్న పోతల నరసయ్యమ్మకు వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, ఓఎస్‌జీ ఫౌండేషన్ సహకారంతో ఆలయ కమిటీ ప్రతినిధులు బియ్యం, నిత్యావసర సరకులు అందించారు.

- భీమిలి మండలం మజ్జివలస కూడలిలోని రాస పోలమాంబ అమ్మవారిని ఆలయ కమిటీ ప్రతినిధులు 9 రకాల పువ్వులు, తులసిమాలలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా త్యాగరాజ ఉత్సవాలు



శోభాయానంగా ఊరేగింపు



120 మందితో బృంద గాత్ర కచేరి

మద్దిలపాలెం(విశాఖ): కళాభారతిలో త్యాగరాజ ఉత్సవాలు రెండో రోజు మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. త్యాగరాజ స్వామి, శ్రీసీతారామ పరివారానికి అష్టోతర పూజలు నిర్వహించారు. కళాభారతి ట్రస్ట్ కార్యదర్శి డాక్టర్. గుమ్ములూరి రాంబాబు శోభాయామనంగా ఊరేగింపు నిర్వహించారు. అప్పన్న శ్రావ్యంగా నాదస్వరం వాయిస్తూ ఉండగా త్యాగరాజ కీర్తలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కళానిధి డాక్టర్. నైవేలి సంతన గోపాలం , ట్రస్ట్ అధ్యక్షుడు మంతెన సత్యనారాయరాజు, ఎస్.రామగోపాల్, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు. కోలాటంతో మహిళలు ఆకట్టుకున్నారు.

శ్రావ్యంగా 120 మందితో గాత్ర కచేరి

సాయంత్రం గాత్ర కచేరిలో 120 మంది గాయనీ, గాయకులు ఒకేసారి బృంద గానం చేసి అలరించారు.

త్యాగరాజ స్వామి పంచరాగ కృతులను ఆలపించి అలరించారు. అనంతరం గురువుల అప్పన్న బృందం మంగళవాయిద్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఉదయం నుంచి రాత్రి వరకూ 49 కచేరీలు నిర్వహించగా, 95 మంది కళాకారులు పాల్గొన్నారు. ద్వారం దుర్గాప్రసాద్ రావు కచేరి శ్రోతలను సమ్మోహితం చేసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మరో మహిళకు తీవ్ర గాయాలు



చెల్లూరి రాంబాబు (ఫైల్)



ప్రమాదంలో మృతి చెందిన రాంబాబు



రోడ్డు ప్రమాదంలో తుక్కుతుక్కు అయిన కారు

ఆనందపురం: మండలంలోని మామిడిలోవ వద్ద జాతీయ రహదారిపై లారీని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరో మహిళకు గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని వేములవలసకు చెందిన చెల్లూరి రాంబాబు (33) పాలవలసలోని నాగహనుమాన్ సీఫుడ్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రాంబాబు మంగళవారం తన స్నేహితుడు కారు తీసుకొని తానే డ్రైవింగ్ చేస్తూ వేములవలస నుంచి బయలుదేరి పెందుర్తి వైపు జాతీయ రహదారి గుండా ప్రయాణిస్తున్నాడు. ఆ కారు సత్రవు జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. ఈ సంఘటనలో కారు నడుపుతున్న రాంబాబు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కారులో ప్రయాణిస్తున్న మండలంలోని ముకుందపురానికి చెందిన ఎం.గంగాభవానికి తీవ్ర గాయాలు కాగా 108 వాహనంలో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఆమె కూడా రాంబాబు పనిచేస్తున్న సీఫుడ్ కంపెనీలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో కారు తుక్కుతుక్కు అయింది. సంఘటనా స్థలానికి ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పలరాజు చేరుకొని విచారణ జరిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడుకి భార్య రమణ, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

TO - LET

- 2 BHK Portion 2nd Flr. 1050 Sft. with full furniture for Families, Offices, Students at Netaji Street, Pithapuram Colony, Maddilapalem. Ph : 91107 13399, 89782 08994 [V- 797162]

Services

BUSINESS OFFER

- స్త్రీ/పు. చిన్న పెట్టుబడితో ప్రాఫిట్ షేరింగ్ బిజినెస్ ద్వారా ప్రతి నెల 50,000/- ఆ పైన ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. 7013203996, 7981283606 [H-801469]

GOLD LOANS

- లోకల్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11574]

T.V. REPAIR

- SVS TV రిపేర్స్ : 83677 16961 LED, LCD, A/C, వాషింగ్ మెషిన్స్, ఫ్రిజ్, మైక్రోఓవెన్, మీ ఇంటి వద్దనే రిపేర్ చేయబడును. 25 సం॥ Ex, 3 సం॥ వారంటీ కలదు. [V- 797165]

Wanted

- విజయవాడలో ఇంటివద్దనే వుండి పేషెంట్‌లను /పెద్దవారిని చూసుకొనుటకు అనుభవం వున్న M/F కేర్ టేకర్స్ / నర్సులు కావలెను. రూమ్+భోజనం + మంచి జీతం ✆ 91608 35559, 78158 35561 [B-623]
- విశాఖపట్నం సిటీలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం డ్యూటీ, జీతం: రూ 16000/-, 8 గం డ్యూటీ జీతం: రూ 11500/- PF & ESI. Contact: 63091 17778, 70939 31732 [B-1255242]
- ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233767]
- విశాఖపట్నంలో సెక్యూరిటీ ఫీల్డ్ ఆఫీసర్స్ (Ex-Service or సివిల్) కావలెను. జీతం: 30,000/- PF & ESI సౌకర్యం కలదు. సంప్ర॥ 630 911 7778. [B-1255250]
- ప్రముఖ కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ (M/F) కావలెను. Qlf : 10th - PG. జీతం : 22వేలు + ఇన్సెంటివ్స్ (నో ఏజ్ లిమిట్స్) ట్రైనింగ్ సపోర్ట్ ఇవ్వబడును. ఫోన్ : 95151 12828 [V- 797166]
- సెక్యూరిటీగార్డులు కావలెను : RTC కాంప్లెక్స్ / గాజువాక ఏరియాల్లో పనిచేయుటకు. జీతము : 12,000/- + రూమ్ కలదు. సంప్ర : 81795 52684, 63007 25191 [V- 2972]
- సెక్యూరిటీ, హౌస్ కీపింగ్, ఫీల్డ్ సూపర్ వైజర్లు కావలెను. అర్హత : MBA. డిగ్రీ, RSR, ఓన్లీ విమల్ షాప్‌పై 3వ ఫ్లోర్, CMR - జగదాంబ రోడ్డు, వైజాగ్. వాట్సప్ : 77029 59468, ఫోన్ : 87904 11889 [V- 1381]
- అక్కయ్యపాలెం వృద్ధులకు, బెడ్ పేషెంట్లకు సేవ చేయుటకు బెడ్ సైడ్ అటెండర్స్, కేర్ టేకర్స్ కావలెను. ఆడవారు మాత్రమే. ఫోన్ : 87904 49799 [V- 797114]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 9059633520. [M-1167511]
- భాష్యం ఫార్మసీ మందుల షాపులో పనిచేయుటకు 5సం॥ మందులషాపు అనుభవం గల ఫార్మసిస్టులు కావలెను.లోకేషన్ మద్రిపాలెం వడ్లపూడి HPకాలనీ విశాఖపట్నం✆ 7013849601, 8985528819 [G-8489]
- అనకాపల్లి, నర్సీపట్నం, తుని, చోడవరం, పరవాడ స్కూల్స్‌లో జాబ్ చేయుటకు డేటాఎంట్రీ, అటెండర్స్, కంప్యూటర్ ఫ్యాకల్టీ, ఇతర ఎంప్లాయిస్, టీచర్స్ అర్జెంటుగా కావలెను. Q : 10th - డిగ్రీ, జీతం : 12–18 వేలు, సెల్ : 79936 80951. [A-3007]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి	: 9010546644
యలమంచిలి	: 9951602901
చోడవరం	: 9010210265
నర్సీపట్నం	: 9010234557
పాడేరు	: 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం